క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

మర్రిపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ వాకా వెంకటరెడ్డి అధ్యతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బ్రహ్మయ్య తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని సోమవారం ఓ ప్రకటనలో కోరారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ నివేదికలతో సమావేశంలో పాల్గొనాలని స్పష్టం చేశారు.

సదస్సు అడ్డుకోవడం దుర్మార్గం

వలేటివారిపాలెం: సెప్టెంబర్‌లో తలపెట్టిన 20 దేశాల వియ్–20 పీపుల్స్ సదస్సు అడ్డుకోవడం దుర్మార్గమని సీపీఎం ఇన్‌చార్జి జీవీ రవికుమార్ అన్నారు. స్థానిక బీసీ హాస్టల్ వద్ద సీపీఎం మండల కార్యదర్శి మాదావ రమణయ్య అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సూరిబాబు, మాజీ ఎంపీటీసీ నరసింహం, మర్రి అంజయ్య, సాదు చెన్నకేశవులు పాల్గొన్నారు.

నాడు- నేడు పనుల పరిశీలన

కొండపి: మండలంలోని కె.ఉప్పలపాడు, వెన్నూరు, ముప్పవరం, కొండపి, పెట్లూరు గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చేపట్టిన మనబడి నాడు–నేడు పనులను ప్రోగ్రాం మానిటరింగ్ సభ్యుడు, విశ్రాంత ఎస్ఈ కె.సూర్యనారాయణ సోమవారం పరిశీలించారు. పాఠశాలల్లో పూర్తయిన, ప్రస్తుతం చేస్తున్న పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కె.నరసింహారావు, ఏఈ పి.నాయబ్‌రసూల్, ఎంఈఓ పి.రామారావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

లింగసముద్రం: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను కందుకూరు సెబ్ ఎస్సై మౌలాలి, సిబ్బంది పట్టుకున్నట్లు లింగసముద్రం ఎస్‌హెచ్ఓ ఎ.మల్లికార్జున చెప్పారు. మండలంలోని వీఆర్ కోట వద్ద ఉన్న మన్నేరు నుంచి సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో ఇసుకను తరలిస్తుండగా వీఆర్‌కోట వద్ద సెబ్ అధికారులు పట్టుకుని లింగసముద్రం పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. సెబ్ ఎస్సై మౌలాలి ఇచ్చిన రిపోర్టు మేరకు ట్రాక్టర్లు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్ఓ చెప్పారు.

పొగాకు అత్యధిక ధర రూ.272

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం తూర్పునాయుడుపాలెం, కాకుటూరివారిపాలెం. ఎం.నిడమానూరు గ్రామాల రైతులు 1258 బేళ్లు తీసుకురాగా వాటిలో 1,216 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర కేజీ రూ.272 కాగా, కనిష్ట ధర రూ.159, సరాసరి ధర రూ.263.65 పలికిందని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కొండపిలో రూ.271

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి కామేపల్లి, పచ్చవ గ్రామాల రైతులు సోమవారం 1026 బేళ్లు తీసుకురాగా వ్యాపారులు 963 కొనుగోలు చేశారు. అత్యధిక ధర కేజీ రూ.272, అత్యల్ప ధర రూ.150, సరాసరి ధర రూ.260.87 పలికిందని వేలం నిర్వహణాధికారి ఎస్.రామారావు తెలిపారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు పేదలకు వరం

జరుగుమల్లి: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పేదల పాలిట వరమని కామేపల్లి వైద్యాధికారి నాగరాజు పేర్కొన్నారు. మండలంలోని వర్ధినేనివారిపాలెం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలతోపాటు బీపీ, సుగర్, ఇతర సాధారణ వ్యాధులతో బాధపడుతున్న 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో బీరకాయల చిన మల్లయ్య నడవ లేని స్థితిలో మంచానికే పరిమితం కాగా ఆయన ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేయడంతోపాటు ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న దాత శ్రీహరి

మర్రిపూడి: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మర్రిపూడి మండల శాఖ ఆధ్వర్యంలో కాకర్ల కాంప్లెక్స్ పరిధిలో 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఒంగోలు రోటరీ క్లబ్ సభ్యుడు కొప్పాకుల శ్రీహరి నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. మండలంలోని శివరాయునిపేట ఏపీ పాఠశాల హెచ్ఎం పీవీ కృష్ణయ్య అధ్యక్షతన సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఎంఈఓ డి.ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. కాపీ రైటింగ్ నోట్స్‌ను పాఠశాల విద్యార్థులకు అందజేసిన దాత కొప్పాకుల శ్రీహరి అభినందనీయులన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివన్నారాయణ, కాంప్లెక్స్ చైర్మన్ అబ్బూరి ఆంజనేయులు, ఉపాధ్యాయులు కె.శ్రీనివాసులు, బీడీ కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు

- పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి
- కనిగిరిలో తొలి మొబైల్ ఏటీఎం ప్రారంభం



మొబైల్ ఏటీఎం సేవలను ప్రారంభిస్తున్న పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, పక్కన రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు సత్యాన్నారాయణరెడ్డి

కనిగిరి రూరల్: రైతులకు మెరుగైన, ఉన్నతమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి(బన్నీ) అన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ ఆధ్వర్యంలో కనిగిరి బ్యాంక్ శాఖ పరిధిలో సోమవారం తొలి మొబైల్ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు సులభతరంగా నగదు లావాదేవీలు జరిపేందుకు జిల్లాలో ఐదు చోట్ల మొబైల్ ఏటీఎం బ్యాంకులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కనిగిరి మొబైల్ బ్యాంక్ ద్వారా ఆరు మండలాల్లోని బ్యాంక్ పరిధిలోని రైతులకు సేవలు అందిస్తామన్నారు. సహకార పరపతి సంఘం పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు సత్యన్నారాయణరెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను, రాయితీలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కనిగిరి ప్రాంత ప్రజలకు మొబైల్ బ్యాంక్ ఏటీఎం సేవలు అందించడాన్ని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీలు మడతల కస్తూరిరెడ్డి, ఓకేరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ సూరసాని మోహన్‌రెడ్డి, ఎంపీపీ రామన తిరుపతిరెడ్డి, వాసవీ సత్రసముదాయాల రాష్ట్ర అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, న్యాయవాది ఎస్ శ్రీనివాసులరెడ్డి, ఖాద్రు, సొసైటీ చైర్మన్ సంగు సుబ్బారెడ్డి, బ్యాంక్ మేనేజర్ కృష్ణారెడ్డి, సూపర్ వైజర్ అట్లా శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీటీసీలు మండాది కృష్ణారెడ్డి, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, ఎస్‌కే లతీఫ్, సర్పంచ్‌లు మూలే మాలకొండారెడ్డి, బాబు, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, వెంకటరెడ్డి, కోఆప్షన్ సభ్యులు చింతం శ్రీను, బ్యాంక్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. తొలుత ఏటీఎం లావాదేవిల సేవలను పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి ప్రారంభించగా, ఏటీఎం మొబైల్ వ్యాన్‌ను మున్సిపల్ చైర్మన్ గఫార్, ఏపీ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు సత్యాన్నారాయణరెడ్డి ప్రారంభించారు.

డ్రైనేజీ కాలువలు ఆక్రమిస్తే చర్యలు

- మున్సిపల్ చైర్మన్ గఫార్



వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: డ్రైనేజీ కాలువలు ఆక్రమిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 15వ వార్డులో సోమవారం సమస్య పరిష్కారంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ డ్రైనేజీ కాలువలు ఆక్రమించి నిర్మాణలు చేపట్టడం వల్ల కాలువల్లో మురుగునీరు నిలిచిపోయి, దుర్గంధం వెదజల్లడమే కాకుండా, దోమలు ఉత్పత్తి చెంది రోగాలు ప్రబలుతాయన్నారు. కాలువలు ఆక్రమించిన వారికి తక్షణ తొలగింపుకు నోటీసులు ఇవ్వాలని ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాణిక్యరావు, శానటరీ ఇన్స్‌పెక్టర్ చెన్న కేశవులు, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, ఐతా సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కారంకు చర్యలు

పట్టణంలో లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నట్లు చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో నూతన ట్రాన్స్‌ఫార్మలు ఏర్పాటుకు చైర్మన్ గఫార్, విద్యుత్ అధికారులు, మున్సిపల్ అధికారులు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ కృషితో పట్టణానికి 20 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరైనట్లు చెప్పారు. వాటిలో 6 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, మరో 14 ట్రాన్స్‌ఫార్మర్లలను జనాభా ఎక్కువ ఉన్న, విద్యుత్ సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఏడీఈ ఉమాకాంత్, ఏఈ పవన్‌కుమార్, కాంట్రాక్టర్ బేరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.1.62 లక్షలు



ఆలయ కమిటీకి విరాళం అందజేస్తున్న భక్తులు

సీఎస్‌పురం (పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం వరకు రూ.1,62,564 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ జి.రమణారెడ్డి, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణలు సోమవారం తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ..65,590, లడ్డుప్రసాదాల అమ్మకం ద్వారా రూ.30,150, ఆలయం వద్ద నిర్మిస్తున్న మహాప్రాకార నిర్మాణానికి విరాళంగా రూ.10,116, ఆలయంవద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.41.708, ఇతర విరాళాల ద్వారా రూ.15,000 వచ్చినట్లు ఈఓ, చైర్మన్‌లు తెలిపారు. శాశ్వత అన్నదాన పథకానికి కొమరోలు మండలం కృష్ణంపల్లికి చెందిన గోగంటి రాజశేఖర్ పవిత్ర దంపతులు రూ.10,016, మహాప్రాకార నిర్మాణానికి బద్వేల్‌కు చెందిన ముత్యాల నిర్వాన్ కార్తీక్, నిత్యపూజయ్యలు రూ.10,116 విరాళం నగదును ఆలయ కమిటీకి అందజేశారన్నారు. తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొమ్మినేని వెంకట్రావు, కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలు ఐక్యంగా ఉండాలి



వైఎస్సార్ సీపీ శ్రేణులతో మాట్లాడుతున్న అశోక్‌బాబు

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఐక్యంగా ఉండి పార్టీ పటిష్టానికి కృషి చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సూచించారు. పాకల పంచాయతీలోని చెల్లెమ్మగారి పట్టపుపాలెంలో సోమవారం సాయంత్రం నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికలో స్వల్ప తేడాతో విజయానికి దూరమైన కుర్రు ప్రసన్నకుమార్‌కు వరికూటి మనోధైర్యం కల్పించారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, ఇప్పుడు జరిగిన పొరపాట్లను దృష్టిలో పెట్టుకుని రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్ రెడ్డి, ఎంపీటీసీలు ఏపూరి శ్రీనివాసులు, కొండూరి అంకయ్య, బల్లెల ప్రభాకరరెడ్డి, గోళ్లమూడి సుందర రామిరెడ్డి, కేశవరపు కృష్ణారెడ్డి, తాతయ్య, వాయిల పున్నయ్య, గొల్లపోతు గోవర్ధన్, యరమాల సుబ్బారావు, శ్రీహరిరెడ్డి, పాకనాటి సుబ్బారెడ్డి, షేక్ పటేల్, షేక్ సుల్తాన్, ముళ్లపూడి సత్యన్నారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక మేలు



ప్రకృతి వ్యవసాయం సాగును పరిశీలిస్తున్న ఏడీఏ

కనిగిరి రూరల్: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి రైతులు అధిక మేలును, దిగుబడిని పొందాలని ఏడీఏ ఈ వెంకటరమణ అన్నారు. పట్టణంలోని కాశీపురంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ డి.విజయరాణి తన పొలంలో ప్రధాన పంటగా కంది వేస్తూ, మధ్యలో క్యాడర్ మోడల్‌గా దోస, పక్క వరుసలో సజ్జ రక్షక పంటగా రెండు వరుసల్లో జొన్న, మొక్కజొన్న పంటలను సాగు చేసిన విధానాన్ని సోమవారం పరిశీలించారు. రసం పీల్చే పురుగు ఉధృతిని తగ్గించేందుకు పొద్దుతిరుగుడు, ఆముదం పంటలు వేశారు. పురుగుల ఉధృతి పెరిగినప్పుడే కాషాయాల పిచికారీ చేస్తామని ట్రైనర్ వివరించారు. ఒకే విస్తీర్ణంలో నాల్గు రకాల పంటలు సాగు చేసి అధిక దిగుబడి సాధించేందుకు ప్రకృతి వ్యవసాయం దోహదపడుతుందన్నారు. జిల్లా మేనేజర్ వి.సుభాషిణి, డీపీఎంయూ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు



మాట్లాడుతున్న అసోసియేట్ ప్రొఫెసర్ నరసింగరావు

పామూరు: క్రమశిక్షణతో జీవితంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ప్రభుత్వ ఉన్నతపాఠశాల పూర్వ విద్యార్థి, పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్శిటీ అసోసియేట్ ప్రొఫెసర్ నర్సింగరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం సక్సెస్, హ్యాపినెస్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నేటి పోటీప్రపంచంలో వ్యక్తి జీవనవిధానం, నడవడిక, విజయం కోసం అవలంబించాల్సిన సూత్రాలు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ గుత్తి రమణయ్య, అధ్యాపకులు అసోసియేట్ ప్రొఫెసర్‌ను ఘనంగా సన్మానించారు. ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు దరిశి సత్యనారాయణ, ఏల్చూరి రామారావు, కళాశాల, ప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్సిపల్ స్పందనకు 9 అర్జీలు



కందుకూరులో స్పందనలో ఫిర్యాదులను పరిశీలిస్తున్న కమిషనర్ మనోహర్



కనిగిరి రూరల్: ఆర్డీఓకు అర్జీ అందజేస్తున్న మహిళ

కందుకూరు: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి 9 ఫిర్యాదులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్ తెలిపారు. స్పందన ఫిర్యాదులను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. ప్రధానంగా వ్యక్తిగత సమస్యలతో పాటు, పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీలు వంటి పలు సమస్యలు వచ్చినట్లు తెలిపారు. స్పందన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు ఆయా విభాగాల అధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. ప్రతి వారం జరిగే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, 9177700267 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను చెప్పవచ్చునని తెలిపారు.

కనిగిరి రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో 18 అర్జీలు వచ్చాయి. కనిగిరి మండలం నుంచి 4, పామూరు 2, కేకే మిట్ల 2, హెచ్ఎం పాడు 2, వెలిగండ్ల 3, దర్శి 1, దొనకొండ 1, సీఎస్‌పురం నుంచి 3 అర్జీలను ఆర్డీఓ తోట అజయ్‌కుమార్‌కు స్పందనలో అందచేసినట్లు స్పందన వీఆర్వో రఘు రామయ్య తెలిపారు.

మినుము పంట పరిశీలన

కందుకూరు రూరల్: మండలంలోని చుట్టుగుంట రైతు కె.మాలకొండయ్య సాగు చేస్తున్న మినుము పంటను వ్యవసాయాధికారి వి.రాము పరిశీలించారు. ప్రస్తుతం మినుము రకం పీయు–38 మొక్కు సీతాఫలం తెగులు ఆశించిందని, తెగులు సోకిన ఆకులు ముడతలుగా ఏర్పడి మందంగా, పెద్దవిగా పెరుగుతాయన్నారు. తెగులు సోకిన మొక్కలను పీకి తగులబెట్టాలన్నారు. తెగులు సోకిన మొక్కల నుంచి విత్తనం తీసుకోకూడదన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి వీఏఏ కె.శరత్‌కుమార్ ఉన్నారు.

రైతుల ఆర్థిక అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న రైతు సమాఖ్య నాయకులు

గుడ్లూరు: రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా మండల రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య సంఘం లక్ష్యమని సంఘం అధ్యక్షుడు చేపల వెంకటసుబ్బయ్య అన్నారు. స్థానిక స్త్రీ శక్తి కార్యాలయంలో రైతుఉత్పత్తిదారుల సంఘాల అధ్యక్షుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల కోసం కొత్తపేట రోడ్డులో ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కలెక్షన్ పాయింట్ ద్వారా కంపెనీ ధరలకే నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులను రైతులకు అందిస్తామన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కందుకూరు ఉద్యానశాఖాధికారి బ్రహ్మసాయి మాట్లాడుతూ ఎస్సీ రైతులకు సబ్సిడీపై వివిధ రకాల పనిముట్లకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎఫ్‌పీఓ ప్రధానకార్యదర్శి హనుమంతరావు, ఏపీఎం అశోక్, ట్రెజరర్‌మాల్యాద్రి రెడ్డి, సీసీ ఇందిరమ్మ, ఏడుకొండలు, అనీల్ పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

పీసీపల్లి: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఎంపీపీ అత్యాల జపన్య అధ్యక్షతన జరిగే సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు అందరూ హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

డబుల్ ఓట్ల తొలగింపులో నిష్పక్షపాతంగా వ్యవహరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ దంతులూరి ప్రకాశం

కనిగిరి రూరల్: డబుల్, డూప్లికేట్ ఓట్ల తొలగింపులో నిష్పక్షపాతంగా వ్యవహరించి తొలగింపులు చేయాలని ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని బూత్‌లెవల్ అధికారులు, వెల్ఫేర్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రకాశం మాట్లాడుతూ డబుల్, దొంగ ఓట్ల తొలగింపులో ఏదైనా ఒత్తిళ్లు వస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పార్టీలకతీతంగా ప్రతి బూత్‌లో డబుల్ ఓట్లను తొలగించాలని సూచించారు. అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని తెలిపారు. ఓటర్ల జాబితా పరిశీలన , సవరణలో పారదర్శకంగా నిజాయితీగా వ్యవహరించాలన్నారు. తప్పులు చేసి, బంధు ప్రీతి చూపించినా తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు. డబుల్ ఓట్ల తొలగింపులో నిర్లక్ష్యం, అవకతవకలకు పాల్పడితే వారిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని ఎంపీపీ హెచ్చరించారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

- సబ్‌కలెక్టర్ శోభిక

కందుకూరు: కందుకూరు డివిజన్ పరిధిలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిపిస్తే కఠిన చర్యలు తప్పవని, నాన్ బెయిల్‌బుల్ కేసులు నమోదు చేస్తామని సబ్‌కలెక్టర్ ఎస్ఎస్ శోభిక సోమవారం హెచ్చరించారు. డివిజన్ పరిధిలోని కందుకూరు మున్సిపాలిటీ, కందుకూరు రూరల్, ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం, వలేటివారిపాలెం, కొండాపురం, వరికుంటపాడు మండలాల పరిధిలో ఎక్కడ బాల్య వివాహాలు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. కందుకూరు, ఉలవపాడు, వింజమూరు, ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టుల సీడీపీఓల నంబర్లు 9491051628, 9440814409, 9849117556, నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉలవపాడు: బాల్య వివాహాలు జరుగుతుంటే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఉలవపాడు ఐసీడీఎస్ సీడీపీఓ విజయకుమారి అన్నారు. ఉలవపాడు ప్రాజెక్టు పరిధిలోని ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం మండలాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో సచివాలయాలలోని మహిళా సంరక్షణ కార్యదర్శికి, పంచాయతీ కార్యదర్శికి తెలిపినా వారి పై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు. 18 ఏళ్ల నిండకుండా వివాహాలు జరిపిస్తే 9440814409 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

గుడ్లూరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అని ఐసీడీఎస్ గుడ్లూరు, తెట్టు సెక్టార్లు సూపర్‌వైజర్ కామేశ్వరీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్ల లోపు యువతీ, యువకులకు వివాహాలు చేస్తే నాన్ బెయిల్‌బుల్ కేసులు నమోదు చేస్తామన్నారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుపుతుంటే వెంటనే ఆయా గ్రామ సచివాలయాల మహిళా పోలీసులకు, పంచాయతీ కార్యదర్శులకు సమాచారం అందించాలని ఆమె కోరారు.

షాదీఖానాకు రూ.50 లక్షల మంజూరుకు హామీ



డిప్యూటీ సీఎంను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు

పామూరు: పామూరు షాదీఖానా రెండో అంతస్తు నిర్మాణం నిధుల కోసం డిప్యూటీ సీఎం, రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి అంజాద్‌బాషాను సోమవారం కడపలోని ఆయన కార్యాలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు తమ వినతిపత్రంలో షాదీఖానా పూర్తిస్థాయిలో నిర్మాణం నిధుల కొరతతో నిలిచిందని, రెండో అంతస్తు నిర్మాణానికి రు.50 లక్షలు ఖర్చవుతుందని నిధులు మంజూరుచేయించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు షేక్.నాయబ్‌రసూల్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సెంట్రింగ్‌చాంద్‌బాషా, జేసీఎస్ కన్వీనర్ ఖాదర్‌బాషా పలువురు పాల్గొన్నారు.

2058 బేళ్ల కొనుగోలు

కందుకూరు: కందుకూరులోని రెండు పొగాకు వేలం కేంద్రాల్లో సోమవారం జరిగిన వేలంలో 2058 బేళ్లు విక్రయించారు. వీటిలో కందుకూరు–1లో 965 బేళ్లను వేలానికి ఉంచగా 899 బేళ్లు, కందుకూరు–2లో 1183 బేళ్లకు గాను 1159 బేళ్లు విక్రయించారు. కేజీ పొగాకు అత్యధిక ధర రూ.272, రూ.271 చ్చాయి. అలాగే అత్యల్ప ధర రూ.160, రూ.150 లభించాయి.


బాలికా విద్యను ప్రోత్సహించడమే లక్ష్యం



స్కాలర్‌షిప్ చెక్కులు అందజేస్తున్న మేనేజర్

గుడ్లూరు: ఎస్సీ, ఎస్టీ కులాలలో మెరిట్ ఉన్న బాలికల విద్యను ప్రోత్సహించడమే కెనరా బ్యాంకు విద్యాజ్యోతి పథకం ముఖ్య లక్ష్యమని ఆ బ్యాంకు గుడ్లూరు బ్రాంచ్ మేనేజర్ ఎస్.నాగరాజు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కెనరా బ్యాంకు విద్యా జ్యోతి పథకం కింద ఆరుగురు విద్యార్థులకు సోమవారం స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. పాఠశాలలో యాకసిరి గోవిందమ్మ, పాలకీర్తి జ్యోత్స్న, ,గుండెమడుగుల ప్రత్యూషలకు రూ 2500 చొప్పున, చలంచర్ల హెక్సిబా, జంగిలి ప్రియాంక, తలతోటి పద్మావతిలకు రూ.5 వేల చొప్పున మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కులను అందచేశామన్నారు.

చదువుతోపాటు వ్యాయామం అవసరం



మహబూబ్‌బాషాను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొండపి: విద్యార్థులకు చదువుతోపాటు వ్యాయాయం ఎంతో అవసరమని రీజినల్ కోఆర్డనేటర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ మహబూబ్‌బాషా అన్నారు. మండలంలోని వెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. వ్యాయామానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులతో రోజూ వ్యాయాయం చేయించాలన్నారు. శారీరక దృఢత్వం ఉంటేనే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం ఉపాధ్యాయులు మహబూబ్‌బాషాను ఘనంగా సత్కరించారు. ఆయన వెంట జరుగుమల్లి, నేతివారిపాలెం, ఉప్పలపాడు, పెట్లూరు ఉన్నత పాఠశాలల పీడీలు ఉన్నారు.